జోడూ కుదరకపోతే వచ్చే అనర్థాల్ని 'లంబోదరం' నవల బయటపెట్టింది. ఇతరుల సుఖాల్ని చూడలేక వాళ్ల సంసారంలో నిప్పులు పొయ్యాలనుకొన్న సఖి, ఆమె అన్న వస్తాదు తామే అసూయా పిశాచానికి గురైన తీరు 'చుప్పనాతి' నవలలో ఉంది. అర్హతను మించి ఆశించి భంగపడిన అంశం 'షోగ్గాడు' నవలకి ఇతివృత్తం. అందినదానితో తృప్తి పడకపోతే ఉన్నది కాస్తా ఊడిపోతుందని ఈ నవల చెబుతుంది. కొవ్వలి ఎంతటి విప్లవ భావాలు గలవారో "తప్పేముంది" అనే నవల తెలియజేస్తుంది. పురుషుడు పక్కదారి పడుతుంటే స్త్రీ కూడా ఆ మార్గంలోనే నడవటంలో తప్పేముంది అని ప్రశ్నిస్తుంది నవల. "హియర్ హియర్" అనే నవల ఎంత చదువు చదివినా మూర్ఖత్వంతో సజావుగా సాగే సంసారంలో చిక్కులు తెచ్చుకొని పశ్చాత్తాపపడతారని వెల్లడిస్తుంది. ఈ విధంగా కొవ్వలి నవలల్లోని ఇతివృత్తాలన్ని సమకాలీన సమాజానికి ప్రతిబింబాలే. ఆర్థిక సంబంధాలు, పెళ్ళి, దాంపత్యం...అనే అంశాలపైనే నవలలు రాయబడ్డాయి. నమ్మే ప్రజలున్నంతవరకు మోసం చేసేవారుంటారన్న సత్యాన్ని చాటడానికి కొన్ని నవలలు రాశారు.

కొవ్వలి నవలల్లో ఇతివృత్తాలు విస్తృతమైనవి కాకపోవటంతో పాత్రలు కూడా పరిమితంగానే ఉన్నాయి. ఎక్కువ నవలల్లో రెండు భిన్న దృక్పథాలు కలిగిన పాత్రలు, ఆ పాత్రల వైరుధ్యాలు చిత్రితమయ్యాయి. నవలను కొన్ని కొన్ని భాగాలుగా రచించిన కొవ్వలి సాధారణంగా ఒక దృక్పథం కలిగిన పాత్రల్ని గూర్చి చెప్పి, ఆ తర్వాతి భాగంలో మరో దృక్పథం కలిగిన పాత్రల స్వభావాల్ని చిత్రిస్తూ మధ్యలో కొంత ఔత్సుక్యాన్ని పోషిస్తూ చివర సమన్వయ దృక్పథాన్ని ప్రకటిస్తాడు. కొవ్వలివారి పాత్రలు పాఠకుల మనసుల మీద చెరగని ముద్రను వేస్తాయి. సమాజంలో డబ్బున్న చోట అందమూ, అందమున్న చోట డబ్బూ ఉండదనటానికి కొవ్వలి నవలలెన్నో ఉదాహరణగా నిలుస్తాయి. డబ్బు సమాజంలో ఎంత ప్రభావాన్ని చూపుతుందో తెలిపే నవలలు ఎక్కువ. కొవ్వలివారు వెయ్యి నవలలు రాసినా సంపాదించి ఏమీ లేదు. పైగా పబ్లిషరు నవల రాసిమ్మంటే తక్కువ వెల పెడితేనే రాసిస్తానని పంతం నెగ్గించుకున్న ప్రజా రచయిత కొవ్వలి. అందుకే డబ్బు పాత్రపై ఆయన ఎక్కువ దృష్టి పెట్టారు.

సూటిగా, సరళంగా, సరసంగా తన భావాలను వెలిబుచ్చే నేర్పుతోనే నాటి యువతరం పాఠకులను ఆకట్టుకోగల్గాడు. ఎత్తుగడ, నిర్వహణ, ముగింపుల మాజిక్ తెలిసినవాడు" అని డా॥ ఏటుకూరి ప్రసాద్ చెప్పటం సముచితం. పాఠకుడు నేరుగా కథలోకి దూరిపోయేటట్టు చెప్పడం కొవ్వలి నవలలోని రచనా శిల్పం. వర్ణనలూ, కల్పనలూ ఎక్కడో తప్ప కనిపించవు కథ చకచకా సాగిపోతుంది. కొవ్వలివారి చాలా నవలల్లో 'సస్పెన్స్' ఒక ప్రత్యేకత. పాఠకుల ఆలోచనలకంటె భిన్నంగా ముగించిన నవలూ ఉన్నాయి. "సాహిత్యం సామాజిక ప్రయోజనాన్ని కోరేదిగా ఉండాలి. సమాజాన్ని ఆలోచింపజెయ్యాలి. చైతన్యం గావించాలి" అని అన్నట్లయితే కొవ్వలి నవలలే అందుకు నిదర్శనాలు.

- డా॥ గుమ్మా సాంబశివరావు

## చిన్నకథ

# అరలు

**మనోప్రియ**

నీకు,

నిన్ను ఎలా సంబోధించాలో తెలియక నీకు అంటున్నాను. నీ ఉత్తరం అందింది. ఇన్ని సంవత్సరాల తర్వాత నీ నుండి ఉత్తరం అందుతున్నందుకు సంతోషపడలేదు. నిన్ను అసహ్యించుకోవడం మానేసి చాలా కాలమయింది. మనసులోంచి నిన్ను తుడిచేసుకున్నాను. అన్నయ్య, నాన్న కూడా అంతే. నాకు ఆశ్చర్యం కలిగించిన విషయం ఏమిటంటే నా చిరునామా నీకు ఎలా దొరికిందని! దయచేసి ఇహ నుండి నాకు ఉత్తరాలు రాయకు. నీ చిరునామా ఇచ్చావు. నేనీ చిన్న వయసులో కేన్సరు ఆస్పత్రిలో చనిపోయినా నా శవాన్ని చూడడానికి కూడా రాకు. అంతకంటే నేను నిన్ను ఏమీ కోరను.

నువ్వు నన్ను కన్నతల్లివే. ఒప్పుకుంటాను. నాకూ అన్నయ్యకు అమ్మవు కాలేకపోయావు. ఎక్కడ ఏమయిందో నాకు తెలియదు. తెలుసుకోవాలన్న ఆసక్తి కూడా లేదు. మనువు బొత్తిగా ఇష్టం లేనప్పుడు మమ్మల్ని అసలు కనకుండా ఉండవలసింది. ఆ సమయంలో మృగతృష్ణ తప్ప మరేమీ గుర్తు ఉండి ఉండదు.

పత్రికల్లో వ్యాసాలు, కథలు, ప్రచారం కోసం తపిస్తున్న వ్యక్తుల ఇంటర్వ్యూలు, ఆధ్యాత్మిక రచనలు, ఇంకేవేవో ప్రబోధాలు చేస్తూంటావని విన్నాను. చాలా బాగా రాస్తూంటావని ఎవరో నువ్వు రాసినవి తీసుకొచ్చి నాకు చూపించినప్పుడు నా కడుపులో చేయిపెట్టి దేవినట్టు అనిపించింది. అందరి సంగతి అలా ఉంచి నీ అంతట నీకు చిత్తశుద్ధి లేదు. నువ్వు చెప్పేదేదో నువ్వే ఆచరించవు. కేవలం పేరు కోసమా ఏడ్పు?



నీ ఉత్తరంలో చిన్నప్పటి మాటలు గుర్తు చేశావు. చూచాయగా కూడా గుర్తులేదు. నా మనసంతా శూన్యం అయింది. నా చిన్నతనంలో నాకు ఏదేనా తినిపిస్తూ ఇలా అనేదానివని రాశావు:

"నేను కల్పనను. నీ అమ్మను. నిన్ను కన్న తల్లినే. నేను కల్పనను...

"పాలు కలపనా?

"పాలలో చక్కర కలపనా?

"మిఠాయి కలపనా?

"జున్ను కలపనా?

"మీగడ కలపనా?

"ప్రేమ కలపనా?

"నేనమ్మా నీ కల్పనను" చాలా రాసుకుంటూ వచ్చావు.

గుప్పెడు ముద్దలో గరిటెడు విషం కలిపి ఉంటే ఎంత బావుండనిపిస్తోంది.

నువ్వు బతకాలి. క్షేమంగా ఉండాలి. మరో భర్తతో పిల్లలున్నారు. వాళ్లకోసమయినా నువ్వు బతకాలి. అయితే, ఒక్కమాట. చేతులు జోడించి బతిమిలాడుకుంటున్నాను. ఎవరి బాల్యాన్నీ పారించి అభాగ్యులను చేయకు. ప్లీజ్.

ఇట్లు
నీకు ఏమీ కాని
నేను.